సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

సోమవారం । 12 । ఫిబ్రవరి । 2024



స్వీయ రక్షణకు కరాటే అవసరం

విద్యతో పాటు స్వీయ రక్షణకు కరాటే శిక్షణ అవసరమని సినీ నటుడు సుమన్ తల్వార్ అన్నారు.

- 8లో▸



బాధ్యతల నుంచి తప్పుకుంటున్నా..

కేయూ హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ తన బాధ్యతల నుంచి తప్పుకుంటున్నానని కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డికి లేఖను అందజేశారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

33°/19°

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ క్రమంగా పెరుగుతుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



భూపాలపల్లి రూరల్/చిట్యాల: జిల్లాలో ఆదివారం నిర్వహించిన గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల జిల్లా సమన్వయ కర్త గోల్కొండ భిక్షపతి పలు కేంద్రాలను పరిశీలించారు. చిట్యాల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, మహాత్మాజ్యోతిబాపులే మొగుళ్లపల్లి, గణపురం మోడల్ స్కూల్, కాటారం ట్రైబల్ వెల్ఫేర్ బాలుర పాఠశాల, గంగారం మోడల్ పాఠశాల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో 2,294 మంది విద్యార్థులకు 2071 మంది విద్యార్థులు హాజరయ్యారని అధికారి భిక్షపతి తెలిపారు.

ఎదురుపిల్ల పండుగకు రండి



ములుగు: మాఘశుద్ధ పంచమి బుధవారం (14వ తేదీ) గట్టమ్మ ఆలయంలో నిర్వహించనున్న ఎదురుపిల్ల పండుగకు రావాలని కోరుతూ ఆదివాసీ నాయక్‌పోడ్ ప్రధాన పూజారులు ఆదివారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్కకు పూజా కార్యక్రమాల కరపత్రాన్ని అందించి ఆహ్వానం పలికారు. వీలుచూసుకొని హాజరవుతానని మంత్రి తెలిపారు. ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ అంకిత్, ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్‌లను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా గట్టమ్మ ఆలయ ప్రధాన పూజారి కొత్త సురేందర్ మాట్లాడుతూ ఉదయం 10.30గంటలకు పూజారులు బోనాలతో గట్టమ్మ ఆలయానికి చేరుకునే క్రమంలో ఎదురుపిల్ల పండుగ ప్రారంభం అవుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న లక్ష్మీదేవరలతో డీఎల్‌ఆర్ ఫంక్షన్ హాల్ నుంచి ఆలయం వరకు నాయక్‌పోడ్ కులస్తులందరూ అంగరంగ వైభవంగా కళానృత్యాలతో గట్టమ్మకు ర్యాలీగా చేరుకుంటారని తెలిపారు. బోనం సమర్పించిన అనంతరం హరిత హోటల్ పక్కన ఆదివాసీ నాయక్‌పోడ్ సమ్మేళన సభ నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన పూజారులు కొత్త లక్ష్మయ్య, ఆకుల మొగిలి, అరిగెల సమ్మయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో పర్యవేక్షణ



ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మలను దర్శించుకోవడానికి ఆదివారం భక్తుల లక్షల సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ట్రాఫిక్ నియంత్రణకు ఎస్పీ డాక్టర్ శబరీశ్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. భక్తుల రద్దీ, వాహనాల రాకపోకలను డ్రోన్ కెమెరా ద్వారా గమనించి వాహనాల నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. అమ్మవార్లకు మొక్కులు చెల్లించేందుకు శనివారం మధ్యాహ్నం నుంచే భక్తులు మేడారానికి పోటెత్తగా ద్విచక్ర వాహనాల ద్వారా నిరంతరం గస్తీ నిర్వహిస్తూ వాహనాలను పక్కా ప్రణాళికతో నిర్ణీత పార్కింగ్ ప్రదేశాలకు మళ్లించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరించడంలో భాగంగా భక్తుల వాహనాల రాకను డ్రోన్ కెమెరాల ద్వారా అంచనా వేస్తూ ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పకడ్బందీగా వాహనాలను పార్కింగ్ స్థలాలకు మళ్లించారు.

ఇసుక లారీలను నిలిపివేయాలి

ములుగు రూరల్: మేడారం మహాజాతరకు లక్షలాది మంది మొక్కులు చెల్లించేందుకు వస్తున్న క్రమంలో ఇసుక రవాణా లారీలతో ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయని, వాటిని వెంటనే నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. మండల కేంద్రంలో జాకారం సమీపంలో జాతీయ రహదారి పనులు చేపడుతున్న క్రమంలో కల్వర్టు వద్ద ట్రాఫిక్ స్థంభించిపోయి భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. మేడారం వనదేవతలకు మొక్కులు చెల్లించేందుకు భక్తులు బుధవారం, గురువారం, శుక్రవారం, ఆదివారం అధిక సంఖ్యలో తరలివస్తుండడంతో వాహనాల రద్దీ పెరుగుతుందని తెలిపారు. అధికారులు ఎన్‌హెచ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా జాతర ముగిసే వరకు ఇసుక రవాణా అనుమతులను నిలిపివేసి లారీలను బంద్ చేయాలని కోరారు.

కొత్త హంగులు

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పీఎంశ్రీ

- కార్పొరేట్ తరహా బోధనకు చర్యలు
- జిల్లాలో ఆరు పాఠశాలల ఎంపిక
- మొదటి విడతగా రూ.6లక్షలు మంజూరు



పీఎంశ్రీకి ఎంపికైన టేకుమట్ల జిల్లా పరిషత్ హైస్కూల్

కాటారం: అరకొర వసతులతో కాలం వెల్లదీస్తున్న సర్కారు బడులకు కొత్త హంగులు సంతరించుకోనున్నాయి. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్ది నాణ్యమైన విద్య అందించేందుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు నిధులు మంజూరయ్యాయి. ఈ పథకం కింద జిల్లాలో ఆరు ప్రభుత్వ పాఠశాలలు ఎంపికకాగా మొదటి విడతలో భాగంగా రూ. 6లక్షల నిధులను కేటాయించారు. ఐదేళ్ల పాటు ఈ పథకాన్ని కొనసాగిస్తూ విడతల వారిగా ఎంపికైన పాఠశాలల్లో వసతుల కల్పనకు రూ.కోటి నిధులు వెచ్చించనున్నారు.

ఐదేళ్లపాటు పథకం..

పీఎంశ్రీ పథకాన్ని 2022–23 నుంచి 2026–27 వరకు ఐదేళ్ల పాటు కొనసాగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పించడంతో డిజిటల్ విద్య అమలులో భాగంగా సాంకేతిక పరికరాలు అందజేయనున్నారు. పాఠశాలల గుర్తింపు, లక్ష్యాల నిర్ధారణ, చర్య, ప్రణాళిక ప్రకారం ఆయా పాఠశాలల్లో అభివృద్ధి పనుల అమలుకు చర్యలు తీసుకోనున్నారు.

ఆరు పాఠశాలలు ఎంపిక..

పీఎంశ్రీ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని గతేడాది కేంద్ర ప్రభుత్వం విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. యూడైస్ ప్రకారం జిల్లాలో 20 పాఠశాలలను ఈ పథకానికి అర్హత కలిగిన వాటిగా గుర్తించగా ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. పాఠశాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ప్రశ్నావళి రూపంలో పొందుపర్చారు. పలు పాఠశాలల వివరాలను డీఈఓలు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు పంపించగా ఇందులో నుంచి 12 పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసి కేంద్రానికి నివేదించింది. కేంద్ర ప్రభుత్వం మాత్రం జిల్లాలోని ఆరు పాఠశాలల్లో ఈ పథకం అమలుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

జిల్లాలో పాఠశాలల వివరాలు..
ప్రాథమిక పాఠశాలలు - 317
ప్రాథమికోన్నత పాఠశాలలు - 44
జిల్లా పరిషత్ పాఠశాలలు - 69
విద్యార్థుల సంఖ్య - 29,164

ఎంపికైన పాఠశాలలు ఇవే..
జెడ్పీహెచ్‌ఎస్ టేకుమట్ల
జెడ్పీహెచ్‌ఎస్ కాళేశ్వరం
జెడ్పీహెచ్‌ఎస్ గొల్లబుద్దారం
జెడ్పీహెచ్‌ఎస్ చెల్పూరు
టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ చిట్యాల
మోడల్ పాఠశాల మల్హర్

రూ.45లక్షల నుంచి రూ.2కోట్ల వరకు నిధులు..

పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం ఐదేళ్ల కాలంలో ఒక్కో పాఠశాలకు రూ.45 లక్షల నుంచి రూ.2కోట్ల వరకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించనుంది. ఎంపికైన పాఠశాలల్లో వసతులు కల్పించి ఆదర్శంగా నిలిచేలా తీర్చిదిద్దుతారు. విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించడంతో పాటు ఆధునిక సాంకేతిక వనరులు సమకూర్చుతారు. విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యతో పాటు వారి సర్వతోముఖాభివృద్ధికి క్రీడలు, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తారు. ఎంపికైన పాఠశాలల్లో సౌర విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకొస్తారు. ఎల్‌ఈడీ విద్యుత్ దీపాలను అన్ని తరగతి గదుల్లో ఏర్పాటు చేయిస్తారు. సంప్రదాయ పద్ధతిలో బడిలో తోట పెంపకం, విద్యార్థులకు ఆకుకూరలు, కూరగాయలు స్థానికంగా పండించి వాటితోనే భోజనం అందించేలా చర్యలు చేపడుతారు. ఆధునిక బోధన పద్ధతులను అవలంభించడం, కంప్యూటర్ ల్యాబ్‌లు, సైన్స్, గణితం ల్యాబ్‌లు, ఉపాధ్యాయులకు శిక్షణ, జాతీయ నూతన విద్యావిధానం అమలయ్యేలా చర్యలు చేపట్టడం, ప్రహరీ, అదనపు తరగతి గదులు, డిజిటల్ లైబ్రరీ, స్మార్ట్ క్లాస్‌రూంలు, క్రీడా మైదానం, పరికరాల ఏర్పాటు తదితర సౌకర్యాలు కల్పించనున్నారు.

కార్పొరేట్ తరహాలో మార్పు..



పీఎంశ్రీ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ తరహాలో మార్పు చోటు చేసుకోనుంది. మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యా ప్రమాణాలు మెరుగుపడుతాయి. పీఎంశ్రీ కింద 20 పాఠశాలలకు ప్రతిపాదనలు పంపించగా ఆరు పాఠశాలలు ఎంపికయ్యాయి. మొదటి విడతలో భాగంగా రూ.6లక్షలు మంజూరయ్యాయి. వీటిని ఆయా పాఠశాలల్లో అభివృద్ధి పనులు, విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడానికి వినియోగిస్తాం.

– రాంకుమార్, డీఈఓ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా, ఎస్పీ కిరణ్‌ఖరే, అధికారులు

రేపు మేడిగడ్డకు సీఎం రాక

- ఎమ్మెల్యేలు, ఎంపీల బృందంతో కలిసి బ్యారేజీ పరిశీలన
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ(లక్ష్మీ)బ్యారేజీ లోపాలను పరిశీలించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల బృందం మంగళవారం రానుంది. గతేడాది అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీలో 20వ పియర్ కుంగిన విషయం తెలిసిందే. నవంబర్ 2న ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించారు. అనంతరం అసెంబ్లీ ఎన్నికలు జరిగి కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ బ్యారేజీలో జరిగిన అవినీతిని బయటకు తీయడానికి సీరియస్‌గా తీసుకుంది. పియర్‌లు కుంగడానికి గల కారణాలను డిసెంబర్ 29న మంత్రుల బృందంతో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో ఈఎన్‌సీ మురళీధర్‌రావు వివరించారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలతో తనిఖీలు చేపట్టారు. బాధ్యులపై చర్యలకు ఉపక్రమించి ఆధారాలను సేకరించారు. బాధ్యులైన నీటిపారుదలశాఖ ఈఎన్‌సీ మురళీధర్‌రావును రాజీనామా చేయాలని ఆదేశించగా, రామగుండం ఈఎన్‌సీ నల్ల వెంకటేశ్వర్లును ప్రభుత్వం పదవి నుంచి తొలగించింది. మేడిగడ్డకు ప్రత్యేక బస్సుల్లో వెళతామని బడ్జెట్ సమావేశాల్లో సీఎం ప్రకటించారు.

ఏర్పాట్ల పరిశీలన

ఎస్పీ కిరణ్‌ఖరేలతో పాటు ఇరిగేషన్‌శాఖ ఈఈలు తిరుపతిరావు, యాదగిరిలతో కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. సీఎం పర్యటన సజావుగా సాగేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ భవేష్‌మిశ్రా తెలిపారు.

వేగంగా ఏర్పాట్లు..

సీఎం సభాప్రాంగణం, హెలీప్యాడ్‌లను జేసీబీ, డోజర్‌లతో హుటాహుటిన సిద్ధం చేస్తున్నారు.



సభాప్రాంగణాన్ని చదును చేస్తున్న యంత్రాలు

తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో సీఎం పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై పోలీసులు నిఘా పెట్టారు. సుమారు 2వేల మంది వరకు వచ్చే వీవీఐపీలు, మీడియా కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

వీఐపీలకు కాళేశ్వరం ప్రసాదం..

కాళేశ్వరాలయం ఈఓ మహేష్‌తో కలెక్టర్ భవేష్‌మిశ్రా మేడిగడ్డలో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. సీఎంతో పాటు వీవీఐపీలకు శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయం నుంచి వేదపండితులతో శాలువాతో సన్మానించి, తీర్థప్రసాదం అందజేయనున్నారు. వీవీఐపీలకు స్వామివారి చిత్రపటం బహూకరించనున్నారు. వారి కోసం ప్రత్యేకంగా లడ్డు కేసరి రవ్వ ప్రసాదం తయారు చేస్తున్నట్లు తెలిసింది. ఈ సమావేశంలో డీపీఓ ఆశలత, ఆర్డీఓ రమాదేవి, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, సీఐ రాజేశ్వర్‌రావు, డీఈఈ సురేష్ తదితరులు ఉన్నారు.

45 బస్సుల్లో రాక..

మేడిగడ్డ బ్యారేజీకి సీఎం రేవంత్‌రెడ్డితో సహా మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీలు 45 ప్రత్యేక ఏసీ బస్సుల్లో హైదరాబాద్ నుంచి ఉదయం 10గంటలకు బయలుదేరుతారు. మధ్యాహ్నం లంచ్ చేసిన అనంతరం సభాప్రాంగణం వద్ద పీపీటీ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. అంతకుముందు వాహనాల్లో బ్యారేజీ కుంగిన పియర్‌లను పరిశీలించనున్నారు. సభాస్థలి వద్ద 2500మంది వీవీఐపీలు, జర్నలిస్టులు కూర్చునేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటివరకు సీఎం రాకపై షెడ్యూల్ మాత్రం ఖరారు కాలేదు.

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం: గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని బస్వరాజుపల్లి, పరుశరాంపల్లి, ధర్మరావుపేట, నగరంపల్లి, అప్పయ్యపల్లె, సీతారంపురం, కొండాపురం, వెంకటేశ్వరపల్లె, గణపురంలో పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి తన వంతుగా నిర్విరామంగా కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రితో మాట్లాడి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. మండలంలో పుట్టిన బిడ్డగా మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడానికి ప్రత్యేక కృషి చేస్తానని చెప్పారు. మండలకేంద్రంలో త్వరలో సెంట్రల్ లైటింగ్ నిర్మాణం చేపడుతామని తెలిపారు. గణపసముద్రం చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో మాట్లాడి మొదటి విడతలో రూ.18 కోట్లు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ఘనస్వాగతం పలకాలి..

భూపాలపల్లి రూరల్: ఈనెల 13న కాళేశ్వరం ప్రాజెక్టు పరిశీలనకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఘనస్వాగతం పలకాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డితో కలిసి ఆదివారం రాత్రి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అప్పుల రాష్ట్రంగా మార్చారన్నారు. ప్రతి శాఖను అస్తవ్యస్తం చేశారని తెలిపారు. 100 రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని చెప్పినప్పటికీ రెండు నెలలు కాకముందే బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పనున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు చల్లూరి మధు, అప్పం కిషన్, ఆకుల మహేందర్, రాంనేని రవీందర్, గుమాస భూమయ్య పాల్గొన్నారు.



గణపురంలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే



భూపాలపల్లి రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

హేమాచలక్షేత్రంలో భక్తుల సందడి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



భక్తులను శఠగోపంతో ఆశీర్వదిస్తున్న పూజారి

మంగపేట: మల్లూరులోని శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంతో పాటు చింతామణి జలపాతం, వనదేవత(ధైత అమ్మవారి) ప్రాంతం భక్తజనంతో పాటు భారీ వాహనాలతో జాతరను తలపించింది. ఆలయంలోని స్వయంభు స్వామివారిని దర్శించుకునేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో పాటు మేడారం సమ్మక్క–సారలమ్మ వనదేవతలను దర్శించుకున్న భక్తులు సైతం ఆలయానికి వేలాదిగా తరలిరావడంతో ఆలయ ప్రాంతం నిండిపోయింది. వివిధ వాహనాల్లో ఉదయాన్నే గుట్టపైకి చేరుకున్న భక్తులు ఆలయ సమీపంలోని పవిత్ర చింతామణి జలపాతం వద్ద పుణ్యస్నానాలు ఆచరించి హేమాచల కొండపై ఉన్న ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు రాజశేఖర్‌శర్మ, కారంపుడి పవన్‌కుమార్ ఆచార్యులు ఈశ్వర రామానుజదాస్ స్వామివారికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నువ్వుల నూనెతో తిలాతైలాభిషేకం, ప్రత్యేక అర్చనలు జరిపించి నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొని మానవ శరీరంతో పోలి ఉండే స్వామివారి నిజరూప దర్శనం చేసుకుని భక్తులు పులకించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ పూజారులు గోత్ర నామాలతో ప్రత్యేక అర్చనలు జరిపించి స్వామివారి చరిత్ర, ఆలయ పురాణం వివరించి వేద ఆశీర్వచనం ఇచ్చారు.

స్వచ్ఛ మేడారం దిశగా..

ఎప్పటికప్పుడు చెత్తాచెదారం తొలగింపు

- 10 డంపింగ్ యార్డుల ఏర్పాటు
- పర్యవేక్షిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్
- ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానా.?



చెత్తను సేకరిస్తున్న కూలీలు

ములుగు : మేడారంలో ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న శ్రీ సమ్మక్క–సారలమ్మ మహాజాతరతో పాటు తిరుగువారం ముగిసేంత వరకు ఎక్కడా చెత్తాచెదారం.. దుర్గంధంతో భక్తులు ఇబ్బంది పడకుండా జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టింది. కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీజ ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తూ జిల్లా పంచాయతీ అధికారి కొండా వెంకయ్యకు సూచనలిస్తున్నారు. ఈసారి అమ్మవార్లకు ముందస్తు మొక్కులు చెల్లించేందుకు భక్తులు అధికసంఖ్యలో వస్తుండడంతో జనవరి నుంచే కూలీలను రంగంలోకి దింపారు. మార్చి 15వ తేదీ వరకు వీరంతా మేడారంలోనే ఉండి పనులు చేయాల్సి ఉంటుంది. మొత్తానికి ఈ సారి స్వచ్ఛమేడారం దిశగా అధికార యంత్రాంగం కృషి చేస్తోంది. తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించడానికి వ్యాపారులకు రెండు రకాల బ్యాగులు అందిస్తున్నారు. ఉదయం, సాయంత్రం డంపింగ్ యార్డులకు తరలిస్తారు.

5,200 మంది కూలీలు

భక్తుల రద్దీ దృష్ట్యా జిల్లా పంచాయతీ శాఖ తరఫున 5,200 మంది చెత్త సేకరణ కూలీలు అవసరం ఉంటారని అంచనా వేసి.. ముందస్తుగా 4,000 మందిని తీసుకువచ్చారు. జాతర సమయంలో మరో 1,200 మంది కూలీలను తీసుకురానున్నారు. వీరికి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మొదటి షిఫ్టు, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు రెండో షిఫ్టు, రాత్రి ఎనిమిది నుంచి ఉదయం వరకు మూడో షిఫ్టుగా కేటాయించారు. పర్యవేక్షణ బాధ్యతను ఎంపీఓ, సీనియర్ సెక్రటరీలకు అప్పగించారు.

10 డంపింగ్ యార్డుల ఏర్పాటు

సేకరించిన చెత్తను ఎప్పటికప్పుడు తరలించేందుకు మేడారం చుట్టు గ్రామాల్లోని ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. కొంగలమడుగు–ఏ, బీ, చింతల్‌క్రాస్–ఏ, బీ, గుడ్డెల్లుగుట్ట–ఏ,బీ, కన్నెపల్లి, ఊరట్టం, కొత్తూరు వంటి 10 డంపింగ్ యార్డులను కేటాయించారు. ఇక ఓల్డ్ శానిటైజేషన్ క్యాంపు, కొత్తూరు, జీపీ ఆఫీస్, ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఆర్టీసీ క్రాస్‌రోడ్, అమ్మవార్ల గద్దెల పరీవాహక ప్రాంతాలు, రెడ్డిగూడెం, చింతల్ క్రాస్, కొత్తూరు, విద్యుత్ సబ్‌స్టేషన్, ఊరట్టం వద్ద డ్యూటీ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఒక్కో పాయింట్‌లో 300 మంది ఒక షిఫ్టులో చెత్త సేకరిస్తారు.

దుర్గంధం వెదజల్లకుండా బ్లీచింగ్..

బోరు బావులు, భక్తులు వంట చేసుకునే ప్రాంతాలు, ఆలయ పరిసరాలు, చికెన్, మటన్ కోసే ప్రాంతాలు, నీటి నిల్వలు ఉండే స్థలాలు, నీటి ట్యాంకులు వంటి ప్రదేశాల్లో బురదతో దుర్గంధం వెదజల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కోళ్లు, మేకల చర్మాలు, వ్యర్థాలను తొలగిస్తున్నారు. పరిశుభ్రతలో భాగంగా 40వేల బ్లీచింగ్ పౌడర్ బస్తాలు అందుబాటులో ఉన్నాయి.

ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానా.?

తిరుమలలో అమలవుతున్న ప్లాస్టిక్ ఫ్రీ పద్ధతిని ఇక్కడ అమలుకు గత రెండు జాతరల నుంచి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎంత ప్రచారం చేసినా ప్లాస్టిక్ వినియోగం తగ్గుముఖం పట్టడం లేదు. దీంతో ఈసారి రాష్ట్రంలోని ఆయా జీపీల అధికారుల ద్వారా మేడారం జాతరకు వెళ్లే వారు ప్లాస్టిక్ వస్తువులు తీసుకువెళ్లకూడదని అవగాహన, టాంటాం చేస్తున్నారు. ఎవరైనా జాతర సమయంలో ప్లాస్టిక్ వినియోగిస్తూ కనిపిస్తే రూ.500 అంతకంటే ఎక్కువ జరిమానా విధించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

24గంటలు పర్యవేక్షిస్తున్నాం..



పారిశుద్ధ్య పనులను 24గంటల పాటు పర్యవేక్షిస్తున్నాం. ఎక్కడా భక్తులకు ఇబ్బందులు రాకుండా చూస్తున్నాం. ఆంధ్రప్రదేశ్ నుంచి ఇప్పటికే 4,000 మందిని చెత్త సేకరణకు తీసుకొచ్చాం. మహాజాతర సమయానికి మరో 1,200 మంది వస్తారు. బురద ఉంటే వెంటనే గుర్తించి బ్లీచింగ్ చల్లుతున్నాం. అయినా ఇప్పటి వరకు ఎలాంటి సమస్య ఎదురుకాలేదు. జాతర పూర్తయ్యేంత వరకు ఇలాగే కొనసాగిస్తాం.

– కొండా వెంకయ్య, డీపీఓ



భక్తజన సందడి

మేడారం మహాజాతర ప్రారంభానికి ఇంకా తొమ్మిది రోజులు మిగిలి ఉంది. ఇప్పటికే లక్షలాది మంది భక్తులు నిత్యం దర్శించుకొని ముందస్తు మొక్కులు చెల్లిస్తున్నారు. ఆదివారం తెలంగాణతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర నుంచి భారీగా తరలివచ్చి తల్లులను దర్శించుకున్నారు. బంగారం(బెల్లం), చీరసారె, పసుపు, కుంకుమ, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

– ఎస్ఎస్‌తాడ్వాయి

– వివరాలు 8లో▸

క్లుప్తంగా

గురువు కుమార్తె వివాహానికి ఆర్థికసాయం



చెక్కు అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

కేసముద్రం : మండలంలోని కల్వల గ్రామానికి చెందిన గురువు, నవజ్యోతి పబ్లిక్ స్కూల్ హెచ్ఎం ఎల్లగౌడ్–రేణుక దంపతుల కుమార్తె వివాహానికి పూర్వ విద్యార్థులు రూ.1,55,000ల ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు. పూర్వవిద్యార్థులు చందాగోపి, పరిపాటి సురేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, సోమిరెడ్డి, రాజేష్‌గౌడ్, ఓంకార్, మహేష్, వెంకన్న, దిలీప్, వినోద, శ్రీను, పవన్, రాజు, విజయ్, నవీన్, రాము, యాకుబ్‌రెడ్డి, మాధవి, సునీత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో స్వీయ రక్షణ

- సినీ నటుడు సుమన్



సమావేశంలో మాట్లాడుతున్న సుమన్

నర్సంపేట : విద్యతో పాటు స్వీయ రక్షణకు కరాటే శిక్షణ అవసరం అని సినీ నటుడు సుమన్‌తల్వార్ సూచించారు. విద్యార్థి దశ నుంచే బాలికలు, మహిళలు స్వీయ రక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని పద్మశాలి గార్డెన్‌లో షోటోకాన్ ఇన్‌స్ట్రక్టర్, కరాటే మాస్టర్ రచ్చ శ్రీనుబాబు ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ స్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడారు. దేశంలో ఏ ప్రభుత్వాలు వచ్చినా మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. తమ స్వీయరక్షణకు, ఆత్మరక్షణకు కరాటే అవసరం అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడం కోసం కరాటే చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించే రచ్చ శ్రీనుబాబు, రచ్చ భవానిచంద్ వంటి కరాటే మాస్టర్లకు క్రీడాభిమానులు చేయూతనందించాలని కోరారు. కార్యక్రమంలో అయ్యప్పస్వామి ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్, శ్రీరాంఈశ్వరయ్య, కాంగ్రెస్ నాయకులు రంజిత్‌రెడ్డి, రామానంద్, రవితో పాటు వివిధ జిల్లాలకు చెందిన కరాటే మాస్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తజన సందడి

అమ్మవార్లకు లక్షకు పైగా భక్తుల మొక్కులు

14న మండమెలిగె పండుగ



క్యూలో కిక్కిరిసిన భక్తులు



వనదేవతల గద్దెల వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ఎస్ఎస్‌తాడ్వాయి : సమ్మక్క–సారక్క మహాజాతరకు సమయం ఆసన్నమవడంతో అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు ఆదివారం మేడారానికి లక్షల సంఖ్యలో తరలివచ్చారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్రల నుంచి అధికసంఖ్యలో భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. సకుటుంబ సమేతంగా వేలాది వాహనాల్లో వనదేవతల సన్నిధికి చేరుకున్నారు. రాత్రి తల్లుల సన్నిధిలో బస చేసిన భక్తులు ఉదయాన్నే జంపన్నవాగు స్నానఘట్టాల వద్ద ఏర్పాటు చేసిన షవర్ల కింద స్నానాలు చేస్తున్నారు. పసుపు కుంకుమలను జంపన్నవాగులో వదిలి, కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అమ్మవార్ల గద్దెల వద్ద చీరసారె, పసుపు, కుంకుమ, ఒడిబియ్యం, కొబ్బరికాయలు, పువ్వులు, పండ్లు, నిలువెత్తు బంగారం, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం సెలవుకావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలిరాగా అధికారులు గద్దెలకు తాళాలు వేశారు. దీంతో బయట నుంచి భక్తులు మొక్కులు చెల్లించారు. సుమారు 2 లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు.

బుధవారమే మండమెలిగె..

మహాజాతరకు తొమ్మిది రోజుల సమయమే ఉండడంతో ఈసారి దర్శనానికి కోటి యాభై లక్షల మంది భక్తులు వస్తారని అధికారుల అంచనా వేస్తున్నారు. జాతరకు వారం రోజుల ముందుగా ఈనెల 14న(బుధవారం) సమ్మక్క–సారలమ్మ పూజారులు మండమెలిగె పండుగను నిర్వహించనున్నారు. మండమెలిగె పండుగకు రెండు రోజులే గడువు ఉండడంతో పూజారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మండమెలిగె పండుగకు సంబంధించిన సామగ్రిని దేవాదాయశాఖ అధికారులు పూజారులకు అప్పగించేందుకు సిద్ధం చేశారు. ఆదివారం మేడారంలో ఎక్కడ చూసిన రోడ్ల వెంట వాహనాల బారులు కనిపించింది. ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. వాహనాలను పార్కింగ్ స్థలాల్లోకి మళ్లించారు.



ఎత్తు బంగారంతో వస్తున్న కుటుంబసభ్యులు



కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు



పూనకంతో వస్తున్న దేవర భక్తుడు



జంపన్న వాగులో షవర్ల వద్ద భక్తుల స్నానాలు



గద్దెల వద్ద కోళ్ల కావడితో వస్తున్న భక్తుడు



ఎత్తు బంగారంతో వస్తున్న భక్తురాలు



జంపన్న వాగు సమీపంలో వాహనాలు, గుడారాలతో భక్తులు



ఐటీడీఏ గెస్ట్‌హౌస్ సమీపంలో ట్రాఫిక్ జామ్

ఎంపీ టికెట్ ఇవ్వాలి



మురళీదర్శన్‌కు టికెట్ ఇవ్వాలని కోరుతున్న అధ్యాపకులు

కేయూ క్యాంపస్ : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ న్యూఢిల్లీ ఫార్మర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఇ.మురళీదర్శన్‌కు కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా టికెట్ కేటాయించాలని ఆదివారం కాకతీయ యూనివర్సిటీ బీఆర్ అంబేడ్కర్ స్టడీస్ సెంటర్ మాజీ డైరెక్టర్లు, ఫార్మసీ కళాశాల డీన్ గాదె సమ్మయ్య, మ్యాథమెటిక్స్ విభాగం ఆచార్యులు డాక్టర్ ఎల్.పి.రాజ్‌కుమార్ కోరారు. మురళీదర్శన్‌కు కాంగ్రెస్ పార్టీ తరఫున వరంగల్ పార్లమెంట్ టికెట్ కేటాయిస్తే విద్యావంతులు, మేధావులు తమ సామాజిక వర్గానికి చెందిన వారు కూడా హర్షిస్తారని వారు అభిప్రాయపడ్డారు.

నేటినుంచి ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని నమిలిగొండ గ్రామంలో కడియం ఫౌండేషన్ సహకారంతో నమిలిగొండ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 12, 13, 14వ తేదీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడా పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ జె.దిలీప్‌కుమార్ తెలిపారు. ఆదివారం నమిలిగొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. క్రీడల్లో నిబంధనలు పాటించాలని, తుది నిర్ణయం అంపైర్‌దేనని, నిర్ణీత సమయానికి టోర్నమెంట్‌కు హాజరుకావాలన్నారు. క్రీడాకారులకు భోజన సౌకర్యం ఉందని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేత జట్టుకు మొదటి బహుమతి రూ.50,116, రెండో బహుమతి రూ.30,116, మూడో రూ.20,116, నాల్గోవ రూ.15,116, ఐదో రూ.10,116, ఆరో బహుమతి రూ.8,116 నగదుతో పాటు షీల్డ్‌లు అందించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 97040 24699, 96762 76711, 95022 42263 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

కారు బోల్తా.. పలువురికి గాయాలు

మహాముత్తారం : మండల కేంద్రలోని ప్రధాన రహదారిలో ఓ కారు అదుపు తప్పి బోల్తా పడింది. మహాముత్తారం మండలంలోని యామన్‌పల్లి నుంచి మహాముత్తారం మీదుగా అజాంనగర్ వెళ్తున్న ఓ కారు పోలీస్‌స్టేషన్ సమీపంలోని ప్రధాన రోడ్డు మలుపువద్ద అదుపు తప్పి విద్యుత్ స్తంభం సపోర్టు స్తంభానికి ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలైనట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. క్షతగాత్రులను పోలీసులు ప్రైవేట్ వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

బాధ్యతల నుంచి తప్పకుంటున్నా..

- హెచ్‌టీఎమ్ విభాగాధిపతి ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్
- కాంట్రాక్టు ఫ్యాకల్టీలో సీనియర్ అధ్యాపకుడికి అధిపతిగా నియమించాలి
- కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డికి లేఖ

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ తాను బాధ్యతల నుంచి తప్పుకుంటున్నానని కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డికి శనివారం లేఖను అందజేశారు. అలాగే అతని స్థానంలో కాంట్రాక్టు ఫ్యాకల్టీలో సీనియర్ అధ్యాపకుడికి అధిపతిగా నియమించాలని కోరారు. ఈవిషయాన్ని ఆదివారం మనోహర్ సైతం ధ్రువీకరించారు. కాగా తనను హెచ్‌ఓడీ బాధ్యతల నుంచి రిలీవ్ చేయాలని రిజిస్ట్రార్‌ను లేఖ ద్వారా కోరారు.

ఒక్కప్పుడు 11మంది రెగ్యులర్ అధ్యాపకులు

కాకతీయ యూనివర్సిటీలో హిస్టరీ విభాగం 1984లో ఏర్పాటుచేశారు. ఆ విభాగంలో 11మంది రెగ్యులర్ ఫాక్యల్టీ తమ సేవలు అందించగా ఇప్పటివరకు పది మంది రెగ్యులర్ అధ్యాపకులు పదవీ విరమణపొందారు. ఒక్కరే సీనియర్ ప్రొఫెసర్ మనోహర్ ఉండగా మరొకరు కుప్పం యూనివర్సిటీ నుంచి డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 31తో అసలు రెగ్యులర్ ప్రొఫెసర్లు లేని హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంటు విభాగంగా ఉండబోతుంది. అందుకే తాను ఉన్నప్పుడే బాధ్యతల నుంచి తప్పుకుంటే కాంట్రాక్టు అధ్యాపకుడికి బాధ్యతలను ఎలా నిర్వర్తించాలో కొంతకాలంపాటు తాను గైడెన్స్ ఇచ్చే అవకాశం ఉంటుందని ప్రొఫెసర్ మనోహర్ భావిస్తున్నారు. అయితే రిజిస్ట్రార్ ఎలాంటి నిర్ణయం తీసకుంటారో వేచి చూడాల్సిందే.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ One Sittting / Regular: 10th, Inter, NIOS, TOSS, APOSS, DEG, PG, Nagarjuna, SV, YVU, University, Guidelines for B.Tech failed students (KPHB) Ph: AES 9515390685, 9032284760 [H-801585]

REAL ESTATE

వ్యవసాయ భూమి అమ్మబడును

■ వరంగల్–ఖమ్మం హైవేకు 1KM దూరంలో, వరంగల్ పట్టణానికి దగ్గరలో వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో 1-18 గుంటల వ్యవసాయ భూమి అమ్మబడును. 8712545467. [WA-7286]

PLOT FOR SALE

■ రాయగిరి కమాన్ నుండి 2 కి.మీ. WL హైవే నుండి 1.5 కి.మీ. దూరంలో 50 ఎకర్స్ ఓల్డ్ వెంచర్‌లో 60, 40, 33 feet Roadsతో ఓపెన్ ప్లాట్స్ కలవు. చ.గ. కే. 3999/- EMI సౌకర్యం కలదు. ఫోన్: 9959711500 [HA-96514]

SERVICES

■ రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపార రుణం, తక్కువ వడ్డీ రేటు, సిబిల్ అవసరం లేదు, NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏజెంట్స్ కావలెను. అర్బన్ ఫైనాన్స్, పార్టీబా– 7627832084. [T-229]

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

■ మీయొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు, సెల్: 9849145043. [W-788992]

OLD AGE HOME

■ ఒమేగా హోంకేర్ వంట/ఇంటి పని చేయుటకు, వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను 24 గం॥ చూసుకొనుటకు మీ ఇంటి వద్దకే కేర్ టేకర్స్‌ను పంపబడును. హైదరాబాద్. ఫోన్: 8977639664 / 8977639665. [H-793687]

WANTED

■ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ (స్త్రీ/పు) మరియు సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 12000–16000. సంప్ర॥ 9703637320. [W-1220895]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 91777 36926. [M-1233785]

■ పని మనిషి కావలెను. హైదరాబాద్‌లో డాక్టర్స్ కుటుంబానికి ఇంట్లోనే ఉండి వంట పని & చిన్నపిల్లలను చూసుకొనుటకు 18 - 30 ఏళ్ళలోపు గల స్త్రీ కావలెను. జీతం 15,000/- ఫ్రీ భోజనం, వసతి కలదు. వివరాలకు D.బాలాజీ: 9246969042, 9848175211. [V-2393]

■ మన పట్టణాలలో కొత్తగా స్థాపించిన బ్రాంచ్ నందు పని చేయుటకు ఇంటర్, డిగ్రీ చదివిన యువతి/యువకులు కావలెను. వర్క్ ఫ్రం హోం కలదు. సంప్ర॥ 9666934214. [G-824413]

■ Sales & Service Engineers, Qly: Dip. Electronics & B.Sc Electronics/ Any Degree. Divis Medical Systems, Vja, Hyd ✆ 9885327399/ 8498968592 [B-1264654]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వేర్వేరు కారణాలతో పలువురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆదివారం వేర్వేరు కారణాలతో పలువురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. గార్లకు చెందిన ఓ వ్యక్తి ఖమ్మం రైల్వేస్టేషన్ సమీపంలో, సికింద్రాబాద్ అల్వాల్ పరిధిలోని సుభాష్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. అలాగే నర్మెటకు చెందిన ఓ వ్యక్తి మద్యానికి బానిసై ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

రైలు కింద పడి వ్యక్తి..



రామారావు మృతదేహం

గార్ల : ఖమ్మం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి గార్లకు చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగు చూసింది. గార్లలోని చాపల మార్కెట్ బజారుకు చెందిన తోడేటి రామారావు (50) ఖమ్మంలోని వస్త్ర దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. 20ఏళ్ల క్రితం రామారావు భార్య చనిపోగా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా ఇటీవల కూతురు పెళ్లి చేశాడు. భార్య లేకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన రామారావు ఈనెల 4వ తేదీన ఖమ్మం రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల, మొండెం వేరు కావడంతో మృతదేహాన్ని ఎవరూ గుర్తు పట్టలేదు. దీంతో రైల్వే పోలీసులు గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఖమ్మం ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. తండ్రి కనిపించడం లేదని రెండురోజుల క్రితం కుమారుడు ఖమ్మం పోలీస్‌స్టేషన్‌లో తండ్రి ఫొటోతో ఫిర్యాదు చేశాడు. విచారణ చేసిన పోలీసులు ఈనెల 4వ తేదీన రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మీ తండ్రి అని తెలిపారు. కుటుంబ సభ్యులు ఎవరూ రాకపోవడంతో అన్నం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అన్నం శ్రీనివాస్‌కు అప్పగించి మృతదేహాన్ని ఖననం చేసినట్లు కుమారుడికి పోలీసులు తెలిపారు.

డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో ఒకరు..

డోర్నకల్ : డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో ఆదివారం రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్సై భాస్కర్ రావు తెలిపిన వివరాలు.. సికింద్రాబాద్ అల్వాల్ పరిధిలోని సుభాష్‌నగర్‌కు చెందిన గంపనూరి వీరనాగు(36) డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని పట్టాలపై పడుకుని ఆత్మహత్య చేసుకోవడంతో తల తెగినట్లు తెలిపారు. మృతుడి వద్ద సికింద్రాబాద్ నుంచి మహబూబాబాద్ రైల్వే టికెట్ లభ్యమైంది. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ ప్రతినిధి అన్నం శ్రీనివాస్ సహకారంతో ఘటన స్థలం నుంచి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి..



బాలరాజు (ఫైల్)

నర్మెట : మద్యానికి బానిసైన వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలకేంద్రంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. నర్మెటకు చెందిన రైతు ముక్కెర బాలరాజు(38) మద్యానికి బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. ఈక్రమంలో ఆదివారం ఉదయం పాలు తీసుకు వస్తానని వ్యవసాయ బావివద్దకు వెళ్లిన బాలరాజు పశువుల కొట్టంలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య భాగ్య, కూతుర్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కన్నెబోయిన శ్రీకాంత్ తెలిపారు.

వైన్‌షాపులో చోరీ

- రూ.1.50లక్షల నగదు అపహరణ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

జనగామ : జిల్లా కేంద్రంలోని దుర్గాసింధు వైన్‌షాపులో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. కౌంటర్‌ను పగులగొట్టి అందులో ఉన్న సుమారు రూ.1.50లక్షల నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. ఉదయం వైన్స్ యజమానులు షాపు వద్దకు వచ్చి చూసే సరికి తాళాలు పగులగొట్టి ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. పోలీసులకు సమాచారమివ్వగా, ఎస్సై అరుణ్, వేలిముద్రల నిపుణులు అక్కడిక చేరుకున్నారు. దొంగల కదలికలు, కౌంటర్ నుంచి నగదు తీసి బ్యాగులో వేయడం వరకు సీసీ పుటేజీల్లో రికార్డు అయింది. సీసీ పుటేజీలను స్వాధీనం చేసుకున్న పోలీసులు, వేలిముద్రలను సేకరించారు. ప్రధాన రోడ్డుపై ఉన్న వ్యాపార, వాణిజ్య సంస్థలకు భద్రత లేకుంటే, శివారు కాలనీల పరిస్థితి ఏంటని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. వైన్‌షాపులో చోరీకి పాల్పడిన వ్యక్తులు ముసుగు ధరించడంతో అంతర్ రాష్ట్ర ముఠానా.. లేక లోకల్ వ్యక్తులా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఖిలా వరంగల్ పరిధిలో..

ఖిలా వరంగల్ : తాళాలు వేసి ఊరెళ్లిన రెండిళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈఘటన శనివారం అర్ధరాత్రి మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధి బీ.ఆర్.నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల తెలిపిన వివరాలు.. బీ.ఆర్.నగర్‌కు చెందిన గుమ్మడిరాజు యాదగిరి, క్రాంతికుమార్ తమ ఇళ్లకు తాళాలు వేసి ఊరెళ్లారు. కాగా శనివారం అర్ధరాత్రి యాదగిరి ఇంటి ప్రధాన దర్వాజ గడియా తీసి ఇంట్లోకి ప్రవేశించారు. బెడ్రూంలోని బీరువాను ధ్వంసం చేసి చూడగా విలువైన వస్తువులు ఏం దొరకలేదు. దొంగలు అక్కడి నుంచి నేరుగా క్రాంతి కుమార్ ఇంట్లోకి ప్రవేశించారు. ఇంట్లో బంగారం, వెండి, నగదు ఏమీ లేకపోవడంతో వచ్చిన దారిని దొంగలు వెనుదిరిగారు. ఆదివారం ఉదయం పక్కింటి వారు గడియా తీసినట్లు గమనించి ఇంటి యజమానుల తోపాటు మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారమిచ్చారు. క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్ బృందంతో కలిసి ఇన్‌స్పెక్టర్ పి.మల్లయ్య, ఎస్సై రాజు చోరీ జరిగిన రెండిళ్లను పరిశీలించారు. విలువైన వస్తువులు చోరీ కాలేదని నిర్ధారించుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని బాలుడి మృతి



సాధ్విక్(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : పది అడుగులైతే ఇంటికి చేరుకోవాలిన్న సమయంలో ట్రాక్టర్ ఢీకొని కుమారుడు మృతిచెందగా తల్లికి తీవ్రగాయాలైన సంఘటన మహబూబాబాద్ మండలం రెడ్యాల గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ కొర్ని రామ్మూర్తి భార్య సౌజన్య, కుమారుడు సాధ్విక్ (5) గ్రామంలో జరిగిన శుభకార్యానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన బట్టు లింగయ్య కుమారుడు సిద్దు అతివేగంగా ట్రాక్టర్ నడుపుతూ వచ్చి సౌజన్య, సాధ్విక్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. గమనించిన స్థానికులు వెంటనే వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన తల్లి, కుమారుడిని పరీక్షించిన వైద్యులు బాలుడు ఘటన స్థలంలోనే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. సౌజన్య ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఆమెను వరంగల్‌ని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాలుడి తండ్రి రామ్మూర్తి ఇచ్చిన ఫిర్యాదుతో రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాగా సాధ్విక్ మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి..



సుందర్(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ పరిధిలోని శనిగపురం శివారు చెరువు కొమ్ము తండాలో ఆదివారం చోటుచేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు.. శనిగపురం గ్రామ శివారు చెరువుకొమ్ము తండాకు చెందిన వాంకుడోత్ సుందర్(40) రైల్వేలో కాంట్రాక్ట్ పద్ధతిలో కూలీగా పనిచేస్తున్నాడు. కాగా శనివారం ఉదయం తండా సమీపంలోని బావివద్ద తన ద్విచక్ర వాహనం పక్కకు నిలిపి బావి అంచున నిర్మించిన గద్దెపై కూర్చుని ఫోన్ మాట్లాడాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు అదే బావిలో జారిపడ్డాడు. సుందర్ రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో భార్య శిరీష ఆ విషయాన్ని తండావాసులకు తెలిపింది. వారు వచ్చి ఆ బావి వద్ద వెతికినప్పటికి ఎలాంటి సమాచారం లభించలేదు. కాగా ఆదివారం ఉదయం ఆమెతో పాటు తండావాసులు అతడి ఆచూకి కోసం వెతకగా బావి సమీపంలో అతడి టోపీ, చెప్పులు, ద్విచక్ర వాహనం కనిపించాయి. స్థానికులతో కలిసి బావిలో చూసేసరికి మృతదేహం లభ్యమైంది. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకుని సుందర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య శిరీష, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కాగా సుందర్ మృతి విష యం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ ఆస్పత్రికి వచ్చి మృతదేహాన్ని సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బైక్‌పై నుంచి జారిపడి మహిళ..



లక్ష్మి మృతదేహం

గార్ల : బైక్‌పై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మహిళ మృతిచెందిన సంఘటన ఆదివారం మంగలితండాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు .. గార్ల మండలం చిన్నకిష్టాపురం పంచాయతీ మంగలితండాకు చెందిన బానోత్ లక్ష్మి(50) మంగళవారం కూలీ పనికి అదే గ్రామానికి చెందిన మాలోత్ మోహన్ బైక్ ఎక్కి సత్యనారాయణపురం వెళ్తోంది. ఈ క్రమంలో బైక్‌పై నుంచి ఆమె కిందపడడంతో తలకు గాయమైంది. వెంటనే ఆమెను మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం లక్ష్మి మృతిచెందింది. మృతురాలి భర్త బానోత్ బిచ్చా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీనత్‌కుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి..

ఎస్ఎస్‌తాడ్వాయి : మేడారం–తాడ్వాయి మార్గమధ్యలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మేడారం–తాడ్వాయి మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి పడి ఉండగా అంబులెన్స్ సిబ్బంది గుర్తించి చికిత్స నిమిత్తం ములుగులోని సివిల్ ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ముఖం, శరీరంపై తీవ్ర గాయాలు ఉన్నాయని, గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లు గుర్తులు ఉందన్నారు. ఆచూకి తెలిసిన వారు 87126 70087 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

కోళ్లపందెం రాయుళ్ల అరెస్ట్

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జంగేడు శివారులో కోళ్ల పందాలు ఆడుతున్న పలువురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం సాయంత్రం సీఐ డి.నరేష్ కుమార్ ఆదేశాల మేరకు సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కొంతమంది వ్యక్తులు అనుమానాస్పదంగా గుమిగూడగా ఆ ప్రదేశానికి వెళ్లి గమనించామన్నారు. అక్కడ తొమ్మిది మంది రెండు పందెం కోళ్లతో పోటీలు నిర్వహిస్తూ కనిపించారని వారిలో గంజి రవి, పెండ్యాల కుమారస్వామి, తరిమెళ్ల ఏసు, గంజి శీను, వనపర్తి ప్రసాద్, కొమ్ము ప్రకాశం, తిప్ప రవికుమార్, బలుసు మహేష్, తరిమెళ్ల శ్యామ్ ఉన్నారన్నారు. వీరి నుంచి ఎనిమిది ద్విచక్ర వాహనాలు, ఏడు మొబైల్ ఫోన్లు, రూ.39,970ల నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి విచారణ చేస్తునట్లు ఎస్సై శ్రావణ్ పేర్కొన్నారు.